# శ్రీమద్రామాయణము

## గేయ కావ్యము

రచన:
"కళాసరస్వతి", "నాటక కళాప్రపూర్ణ"
ధూళిపాళ
సీతారామశాస్త్రి
రంగస్థల, సినీ నటులు

## అయోధ్యాకాండము

ఓం
శ్రీరామ - శుభ మస్తు
శ్రీ హనుమతే నమః

# అయోధ్యా కాండము

అట్టాలంబున - నయోధ్యాధిపుఁడు
అలరుచునొక - నాడాత్మజు రాముని
రాజొనరింపగ - రహిమది దలచి
చాటబంపెఁబురి - తేటతెల్లముగ 1

చాటింపు

పల్లవి:
ఓహోహొ ప్రజలార - ఒక్కటే విన్నపము
వినరయ్య మీరు - వివరించి చెప్పెదను

చరణం: 1
తలచె నెమ్మదిలోన - దశరథ మహారాజు
రామయ్య తండ్రిని - రాజుగ నొనరింప
పెద్దలందరొప్పిరి - ప్రియమైన రాతలపు
సూర్యోదయమ్మునకె - సుముహూర్తమయ్య || ఓహోహొ ||

చరణం: 2
స్త్రీ పురుషులందఱు - చిరునవ్వు లొలుకుచు
బాల బాలికలంత - బ్రహ్మదీపెనలిడుచు
ఆడుచుఁబాడుచు - నందఱును రండి
ముసలి ముతకల గూడ - ముదముతో గొనిరండి
రండీ, రండీ, రండి - రండహో రండి || ఓహోహొ ||

మిద్దెలు మేడలు - మెరుగు పూతలతో
వీధివీధులనెల్ల - విరజాజి సరులతో
మందిర ద్వారములు - కుందనపు రవలతో
అలంకరించి నా - రయోధ్య నగరంబు 2

దైవజ్ఞులందఱు - దైవపూజలు సేయ
భక్తబృందంబులు - భజనలను సేయగ
అన్నదానంబుల - నహర్నిశలుసేయ
ఆజ్ఞయిడె నప్పుడే - యా భూమిజాని 3

దైవవిధి నెవ్వారు - తప్పింపగాలేరు
ఎప్పుడే యదియెట్టు - లేర్పడంగూడునో
అప్పుడయ్యది యట్లె - తప్పకం జరుగు
విశ్వమంతయు నిండు - విరాట్స్వరూపంబు 4

గూని మంధరజేరి - గుట్టుగా బోధించి
కైకమ్మ మదిని కడు - కలుషితముజేసె
రాముడే రాజైన - రాజమాతవు నీవు
పెద్దదాసివటంచు - దద్ద సందడి జేసి 5

భరతుడిఁక భటుడంచు - పలువిధంబుల జెప్ప
కడునెఱ్ఱవాఱెను - కైకమ్మ కన్దోయి
ప్రబలెను మదిలోన - ప్రతికారవాంఛ
దశరధునిరానంపె - తన మందిరమునకు 6

తక్షణమె తావచ్చి - దశరధమహారాజు
కైకమ్మకై నెమకె - గళవళంబడుచు
ఇల్లంత పరికింప - నేడగనరాదు
కుములుచునుండెను - కోపవేశ్మమున 7

నెమ్మది నిండుట - నీసునసూయలు
పలుమరుం బిలచినం - బలుకదా మగువ
కింకమానుమటంచు - కొంకుచును వేడగ
ఎట్టకేలకు విప్పె - నింతితన పెదవిని 8

రాజునుంబట్టుకొని - రాచిలువవసెను
కుచ్ఛితుడ వీవనె - కుమతుండ వీవనె
కాఱులెన్నో ప్రేలి - కడగండ్ల బెట్టెను
మిన్నకుండెను ఱేఁడు - ఖిన్నవదనముతోడ 9

చివరకు పలికెనా - చిలుకల కొలికి
దేవాసురాజిలో - నీవిచ్చినట్టివి
ఆ రెండు వరములం - దీరుప వలెనిప్డు
ఆడితప్పుట మీకు - కూడదంచిటులనె 10

భరతుని పాలమున - పట్టంబు గట్టుము
రాముని నంపు మా - రణ్యసీమలకు
పదునాలుగేడులు - భరతుడేరాజు
రాముండు మరలిన - రాముడేయౌరాజు 11

బెట్టిదపు బల్కులకు - నట్టె మూర్ఛిల్లి
కొంతతడవుకు దేటి - యింతికిట్లనియె
"వేరేదియేనియుం - కోరుకోగదవే
కూడదని యనకేను - తోడనేజేతును" 12

కఠినాత్మ కైకమ్మ - కరుణించదాయెను
విధిహతుడు దశరథుడు - విపులపై గూలె
ఇది మంచి యదనని - యింతి సంభావించి
రామునకు కబురంపె - రమ్మంచువేగ 13

కమనీయ గాత్రుడు - కంజాత నేత్రుఁడు
అతిలోక వీరుడు - ఆజానుబాహుడు
శ్రీరామచంద్రుఁడు - సారంగగమనుడై
జగము తాపముదీర్చు - చంద్రుడననేతెంచె 14

జనకు దుస్థితిగాంచి - చలియించి రాముఁడు
కారణంబేమని - కైకమ్మ నడుగగ
రాగ కైకమ్మయీ - రమణతాబల్కెను
నీవె కారణమంచు - నిష్ఠురోక్తులనాడె 15

నినుజూడ మోమోడి - నిదురించి నటులుండె
తానుగా వచియింప - తాసిగ్గు పడుచుండె
నీతోడనే చెపుదు - నీ తండ్రిభావంబు
తేటతెల్లంబుగా - జాటేల నిఁకనాకు 16

నిక్కముగ నీవిప్డు నిజమార్గ **వర్తివేన్**
జడలు చర్మము దాల్చి - జటివేషధారివై
పదునాల్గు వర్షముల్ - బహుళాటవులకేగు
పట్టమ్ము భరతునకు - నెట్టనంగట్టుదనె 17

ధీమంతుడు శ్రీరాముడు - దిటవు మదిని వీడలేదు
మాఱు మాట పలుకలేదు - మనమున దా గుందలేదు
తండ్రి కోర్కె దీర్చుటయె - తనయుల విధిగాగ నమ్మి
వల్లెయంచు సమ్మతించె - వనవాసము **జేయుటకై** 18

ఆస్థాన వేదికకు - నందఱేతెంచిరి
సకల సంభారముల - సమకూర్చబడె రాము
పట్టబంధము గాంచ - బహుకుతుకంబున
అమరులెల్లరు నిలిచి - రాకాశవీథిని 19

వచ్చిరి వేవేగ - వసిష్ఠాది ఋషులు
సామంతు లందరు - సకుటుంబముగ వచ్చి
రత్నాల పళ్ళెరముల - రంజిల్లు సువ్వాణి
ముత్యాల కానుకలు - ముదమెసగ దెచ్చిరి 20

క్రొన్ననల దండలు - కొప్పులను నిండగ
తనుహేమ కాంతులు - తళతళన్మెఱయగ
కరములం గాజులు - ఘల్లుమని మ్రోఁగగ
వలుదైన పాలిండ్లు - కులుకులంజూపగ 21

అచ్చరల నొత్తెడి - యందగత్తియలంత
శ్రీరామునకు నీయ - హారతుల దెచ్చిరి
సశాస్త్ర సంగీత - సన్నాయి మొదలైన
వాద్య రవముల మిన్ను - బ్రద్దలుగ మ్రోగె 22

వేదవేత్తలు నాల్గు - వేదముల్ పఠియింప
శాస్త్రవిదులు ధర్మ - శాస్త్రముల్ చర్చింప
చేసన్నలే గాని - చెవికెక్కవే నుడుల్
ముల్లోకముల జనము - మూగిరచ్చోటనె 23

వలగొని రాముండు - పడియున్న జనకునకు
జంత కైకకెఱంగి - జనని సౌధముకేగె
అశ్రుపూరితుడౌచు - ననుజుండు సౌమిత్రి
అతని వెనువెంట - నతిభక్తితో నడిగె 24

నెమ్మి దొల్కాడంగ - నమ్మదాగన్గొని
ప్రియము మీఱ వచింప - పిన్నమ్మ చర్యలు
మతి పోయి, ధృతి గూలి - మఱు మాట లేకయె
కన్నీటి జడిలోన - గౌసల్య మునిగె 25

తేఱుకొని యా తల్లి - దీవెనలనిచ్చె
ఉసురులుగ్గంబట్టి - యుండెదను నేనంచు
రక్ష???కును గట్టె - రాముసేమము గోరి
సీతమ్మ చెంతకు - శ్రీరాము డరిగె 26

భూపుత్రి కు???నేత్రి - పుణ్యవ్రతము లాచరించి
ఇనకులేశు రాకకై - యెదురుజూచుచుండగ
రఘువీరుం డరుదెంచె - రమణి దా ముదమందె
దుర్వార శోకాగ్ని - దురపిల్లుచు రాఘవుడు 27

అల్లన వివరించె నాత - డచ్చోటి గాథనెల్ల
విదుషీమణి విమలచరిత - మదిసించుక నొవ్వలేదు
ధర్మమెపుడు తప్పనమ్మ - తావచ్చెద వనములకనె
వివిధ గతులవేడిచూచె - విభుడు తన్నుగొంపోవ 28

సగపాలు నీవు నాకు - సాబాలు నేను నీకు
అరభాగం బింటనుండ - నర్ధభాగ మడవులనా?
కాని మాట నన్దొలంగి - కానకు నీవేగు మాట
నిన్ను విడచి నాయుసురులు - నిల్వవొక్క క్షణమేనియు 29

మారుబలుకకుము - మానధనాఢ్యా!
కాననకును నను - గైకొని పొమ్మా!
వేదశాస్త్రముల - వెదకిజూచినను
కనబడు దైవము - కాంతకు ధవుడె 30

రమణి ధర్మము జెప్ప - రఘురాముడొప్పుడు
శ్రీరాము పలుకులు - సీతమ్మ వినకుండె
చివరకు జానకి - చిఱుకోపమును జూప
సీతమ్మఁగొనిపోవ - శ్రీరాము డిష్టపడె 31

వెంటనే సౌమిత్రి - వేడుచుం బలికెను
మీసేవయే నాకు - మేటి స్వర్గము సుమీ
మీవెంట వచ్చెదను - మీరెన్ని జెప్పినను
మిము విడచి నిముసంబు - మేనాకు నిలువదు 32

ముత్యాల రత్నాల - ముప్పేట సరములు
మణి భూషణంబులు - మహనీయ దుస్తులు
త్యజియించి కానలకు - దరలుచుండిరి వారు
నారచీరలగట్టి - నగర వీధుల నుండి 33

పట్టణపు పౌరులు - చుట్టునుం జుట్టి

కన్నీటి కాల్వలే - పన్నీటి జల్లులుగ
పాదాబ్జముల్గడిగి - వలగొని పూజించి
దీవనల నిచ్చిరి - దేవతలె మెచ్చగ 34

పరిశుద్ధ మనములే - వరభాజనములుగ
ఉప్పొంగు ప్రేమరస - మొప్పైన యాజ్యముగ
కనుగవల చకచకల్ - కమనీయ జ్యోతులుగ
హారతుల నిచ్చిరి - యఘహారి రామునకు 35

?ి?ద నుండురు - వరము లొసంగగ
హిమగిరిజామాత - ఇమ్మగ బ్రోవంగ
అనుజుండు సౌమిత్రి - వెనువెంటనే రాఁగ

జనకజ తోఁజనె - వనికి శ్రీరాముడు 36

భక్తాఘ హారిణి - పరమ శుభకారిణి

ముల్లోకముల బాలు - చల్లని తల్లి
ముని గణానీకసం - పూజ్య చారిత్ర
విష్ణుపాద ద్వంద్వ - విమలాబ్జ సంజాత 37

గంగా భవానిని - గౌనతేయుఁడు గాంచి
కైమోడ్పు లర్పించె - కడువడి భక్తిని
సారధితోననె - తేరునిట నాపుమని
అందఱును డిగ్గినా రా - గంగ తీరమున 38

## గుహుని పాట

పల్లవి:
రావయ్య రఘువీర - రవిమీర సేవింతు
పాదముల నర్చింతు - పడవపై దాటింతు

అనుపల్లవి:
పెద్ద పెద్దోళ్ళంత - ముద్దు ముద్దుగ నెక్కి
ముచ్చటగ గంగనీ - పుట్టిపై దాటిరి
మాలక్ష్మి మాయమ్మ - మాబుల్లి లక్ష్మయ్య
వెనువెంటనే రాఁగ - వేగమె నాతండ్రి || రావయ్య ||

చరణం: 1
వారిజాసను హంస - వాహనము కంటెను
ముక్కంటి దేవయ్య - ముడి యెద్దు కంటెను
వైకుంఠ వాసుని - వైనతేయుని కంటె
మిన్నగద నా నావ - మెన్నిచూడంగ || రావయ్య||

వగచి రాముం గాంచి - వల??లం గుహుడు
గ్రుచ్చెత్తి కౌగిటను - కూర్మిదాఁ బలికె
ఇచ్చెనట వారలకు - వి??పైన విందును
రమ్మనెను పీటికి - రాజచంద్రులను 39

కౌసలేయుడు, జనకజాత్మజ - కటికనేల బరుండి యుండగ
గుహుడు, తమ్ముడు, సుమంత్రుండును - గురుకార్ముకదారులై
కనుగవలు కాయలుంగాయగ - కాచిరారే??ల్ల కా??తి??
బిలబిలం కూయంగ పక్షులు - తెలతెలంతెల్లారి పోయెను 40

భానూదయంబునసె - భాగీరథింగ్రుంకి
ఇనున కర్ఘ్యంబిచ్చె - ఇనకులేశ్వరుఁడు
మఱ్ఱిపాల్దెప్పించి - శిరసునం బూసికొని
జడలల్లుకొని మువురు - ముడులుగా జుట్టిరి 41

జనని యాన పిధాన - జడలు చర్మము దాల్చి
గంగమ్మ దాటుటకు - కదలి పోవుచునుండ
సుర మౌని చంద్రులే - తరలి నట్లుండె
అట యాశ్రమంబులే - యమరి నట్లుండె 42

మంచి నీతులఁజెప్పి - మంత్రి సిలుజేరుమనె
నేబోయివత్తునని - నిషాదుడెఱగెను
అందరూ నెక్కిరా - యందాల పడవలో
నవయౌవనాంగివలె - నావ నడిచింది 43

అద్దరికి జేరిర ????????????ఱును సేమముగ
సౌమిత్రి ముందుగను - భూమిసుత వెన్వెంట
వారి వెన్నును గాచి - శ్రీరామచంద్రుడు
చెట్టులు, చేమలు - పుట్టలు, కోనలు 44

దాటుచును నడచిరా - దండకాటవిలోన
నల్దెసల జూచినను - నరవాసనయె లేదు
గండ్లు ముండ్లే తప్ప - కండ్లబడ వేపియును
ఎట్లు మనుదురో వార - లీ రేడు వర్షములు 45

చెట్టులాకులే వారి - పట్టు పరుపులు గాగ
చిరుతరాళ్ళే వారి - శిరములకు దిండులుగ
కలకూజితంబులే - లలిజోల పాటలుగ
పండుకొనిరా రేయి - నా??డు భూజము క్రింద 46

తొలి కోడి కూసింది - మలిరేయి గడిచింది
గంగమ్మ యమునమ్మ - సంగమ ప్రాంతమున
భరద్వాజ మహర్షి - భవ్యాశ్రమంబున
ముని వర్యునకు మ్రొక్కి - తనగాధ వివరించె 47

సంతోష సంద్రమున - సంయమీంద్రుఁడు తేలి
స్వాగతము బలికెనా - సరసిజాక్షునకు
స్వస్త్యయన ములఁబొంది - సాగుచు రామయ్య
చిత్ర కూటము జేరె - సీత, సౌమిత్రితో 48

ఝరులతో, చరులతో - కరులతో, గుహలతో
దరులతో, తరులతో, దారువు దొంతరలతో
శుకతతుల పాటలతో - పికపాళి కూతలతో
కమ్మవాసన మించు - కమనీయ సుమములతో 49

ఫలపుష్ప జాతులతో - పచ్చపు నేలలతో
ఉద్యాన వనములతో - ఉదీర్ణలతలతో
కన్దోయికింపైన - కడుకుడుంగములతో
చెలువొప్పుచుండెను - చిత్రకూటాద్రి 50

ముందుగా వాల్మీకి - ముని ముఖ్యునకు మ్రొక్కి
నెట్టనం యాకుటిల్ - దిట్టముగ నటగట్టి
అర్చించి దేవాళి - నట ప్రవేశించిరి.
వినిపింతు నయోధ్య - వృత్తాంత మిక మీద 51

మంత్రి పురమునకేగి - మహిపాలు బొడగాంచి
వివరించ శ్రీరాము - విపిన గాధల నెల్ల
శోకభార మ్మునన్ - శుష్కించి దశరధుడు
కాలగర్భమ్ము నం - గలసి పోయెను తోన 52

జవనాశ్వముల నెక్కి - చారులు వేఁజని
రాజగృహమ్మును - రమణీయ నగరికి
తోడనే భరతునిన్ - దోడ్కొనిరాగ

కైకమ్మ చఁల్లగా - కథనెల్ల వివరించఁ 53

ధరణి బడి విలపించి - తండ్రికై, భరతుడు
నీ ముఖము జూచినను - నిఖిల పాతకమంచు
కుపితుడై తిట్టుచు - కుటిలాత్మ కైకను,

పెదతల్లి గన్గొనగ - బిరబిరం జఁనియెను 54

ములుకులై కౌసల్య - పలుకులు మదినాట
చేయునది లేక తా - సిగ్గుతో తలవంచె

గురునాజ్ఞ భరతుండు - జఁరపితా పితృకర్మ

సేనా యుతింజఁనె - శ్రీరాము దర్శింప 55

అపవర్గదంబయి - ఆనంద దాయియై
అలరుచునుండెడి - యా చిత్రకూటమున

సుకముగ నెలజఁన - నొకనాడచ్చట
ప్రతిధ్వనించెను - పర్వతపు గుహాలు 56

పికర సంతతులు - పిలపిలంగూసెను
పన్నగతతులు - పడగలు విప్పెను
కరి సంతతి ఘీం - కారమొనర్చెను
కారణమేమని - కలయం జూచిరి 57

దారిని గాంచిరి - దారుణ సైన్యము
పిల్లల నెత్తిరి - అల్లెల దౌడిగిరి
భరతుని రాకను - పసిగొనిరంతట
ఉగ్రుడై సౌమిత్రి - ఆగ్రహావేశమున 58

చంపుదు భరతుని - సందేహింపను
ఆజ్ఞ యొసంగుం - డన్నా యనియెను
చిన్మయ తేజుడు - శ్రీరఘురాముఁడు
శాంతింప జేసెనా - సౌమిత్రిఁ దమ్ముని 59

అలసైన్యంబుల - నల్లంతనేయుంచి
కాల్నడ జటియై - కదిసెను భరతుడు
శత్రుఘ్నుడేతెంచి - చరణములను వ్రాలె
గుహుడు, సుమంత్రుడు - కూరిమి నెఱగిరి 60

తండ్రి మృతిని విని - తల్లడిల్లుచు
త్రికరణ శుద్ధిగ - తిలోదకము లిడి
ధన ధాన్యంబుల - ఘన వస్త్రంబుల
తండ్రి ముక్తికై - దాన మొసంగిరి 61

అయోధ్య కేతెంచి - యందఱ గాచుచు
ఏలుము రాజ్యము - నేకధాటినని
గురువులు, తల్లులు - వరముని వర్యులు
అందఱు వేఁడిరి - యా శ్రీరాముని 62

ధీరస్వాంతుఁడు - శ్రీరఘురాముఁడు
కాదని పలికెను - గట్టి మనముతో
శ్రీరామ పాదుకల - శిరమున నిడికొని
భరతుండేగెను - పౌరజనాళితో 63

రామనామమును - రహిమది దలచుచు
నందిగ్రామము - నందునఁదిరపడి
రామపాదుకల - రాజుగఁదలఁచుచు
ఏలుచునుండెను - మేలన భరతుడు 64

ఇది శ్రీహనుమచ్చరణారవింద మిళిందాయమాన మనోవైభవ, ధూళిపాళ శంకరయ్య రత్నమ్మల తనూభవ, సుజన విధేయ, కళాసరస్వతి, నాటకకళా ప్రపూర్ణేత్యాది బిరుదాంకిత సీతారామశాస్త్రి ప్రణీతంబైన గేయరామాయణ కావ్యమందు అయోధ్యాకాండము

శ్రీ హనూమద్రామార్పణమస్తు

శ్రీ శ్రీ శ్రీ